www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00


ప్రజానావ

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

C : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 175 | గురువారం | 05.12.2024



## పోలీస్‌స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డి హల్‌చల్

అర్జెంట్ పని ఉందంటూ వెళ్లిపోబోయిన బంజారాహిల్స్ సీఐ

మా ప్రభుత్వం వచ్చాక నీ సంగతి చెబుతాం

సీఐపై విరుచుకుపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

2



రిక్టర్ స్కేల్ పై 5.3 తీవ్రతతో కంపించిన భూమి

# తెలంగాణలో భూ ప్రకంపనలు


## ఇళ్ల నుంచి బయటకు ప్రజల పరుగులు

ములుగు జిల్లా మేడారం భూకంప కేంద్రంగా గుర్తింపు

దాదాపు 20 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో భూ ప్రకంపన

ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలో కూడా భూకంప తీవ్రత

వెల్లడించిన సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు




ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:
తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. బుధవారం ఉదయం 7.27 గంటలకు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.0గా నమోదైంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు వెల్లడించారు. భూకంప కేంద్రం నుంచి 225 కి.మీ పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, జగ్గయ్యపేట, నందిగామ, ఏలూరు సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. తెలంగాణలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జనగామ జిల్లాల పరిధిలో ప్రకంపనలు వచ్చాయి. హైదరాబాద్ నగర పరిధిలోని వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో భూమి కంపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు,

మిగతా 2లో..

## ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

పదేళ్లలో ఏం చేయకపోగా.. 10 నెలల మా పాలనపై విష ప్రచారం చేస్తున్నారు

కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర రాలేదు


గజ్వేల్‌లోని తన పొలంలో ఎకరాకు రూ.కోటి సంపాదిస్తున్నారు

ఎకరాకు కోటి ఆదాయం ఇప్పటికీ ఓ బ్రహ్మపదార్థమే

పెద్దపల్లి యువ వికాసం సభలో సీఎం రేవంత్‌రెడ్డి



2



## ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లు

2

తెలంగాణ పోలీస్ సంచలన నిర్ణయం

తొలిసారిగా సిటీ కమిషనరేట్ పరిధిలో నియామకాలు

గోషామహల్ స్టేడియంలో ట్రాన్స్‌జెండర్లకు ఈవెంట్స్

మొత్తం 44 మందిని సెలెక్ట్ చేసిన అధికారులు

## డైవర్షన్ పాలిటిక్స్ తప్ప.. చేసిందేమీ లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది

కేవలం ఎనుముల బ్రదర్స్‌కు మాత్రమే లాభం జరిగింది

సీఎం అనే వ్యక్తి రాష్ట్ర ప్రతిష్టను పెంచాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## కేసులు కొట్టేయడం కుదరదు..

### పట్నం నరేందర్‌రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు

లగచర్ల ఘటనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ నరేందర్‌రెడ్డి పిటిషన్

క్వాష్ పిటిషన్‌ను తోసిపుచ్చిన న్యాయస్థానం

2




ప్రజానావ, హైదరాబాద్:
బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను తిరస్కరించింది. అయితే, కేసులోని మెరిట్స్ ఆధారంగా నరేందర్‌రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను పరిశీలించాలంటూ కింది కోర్టుకు సూచించింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. లగచర్లలో ప్రభుత్వ అధికారులపై రైతుల

మిగతా 2లో..



2

## ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

సర్కార్ ఏర్పాటై ఏడాది పూరైన సందర్భంగా రసవత్తరంగా మారే ఛాన్స్

రుణమాఫీ, రైతు భరోసా, హైడ్రా, మూసీ ప్రక్షాళనపై చర్చ జరిగే అవకాశం

## సాహెల్ పోలీస్ విచారణకు రావాల్సిందే


మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకుకు హైకోర్టులో చుక్కెదురు

ఈ నెల 16న పోలీసుల విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశం

ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రజాభవన్ గేట్లను కారుతో ఢీ కొట్టాడని సాహెల్‌పై కేసు

యాక్సిడెంట్ తర్వాత దుబాయ్ పారిపోయిన సాహెల్

2



## నాపై కేసును క్వాష్ చేయండి

- హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్
- ఫోన్ల ట్యాప్ చేశారని హరీశ్‌పై కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు

2





## విజయోత్సవాలు కాదు.. వికృత ఉత్సవాలు

కాంగ్రెస్ పార్టీ దృష్టిలో.. పిల్లలకు పురుగులన్నం పెట్టడం విజయం

యువతకు ఉద్యోగాలివ్వకపోవడం విజయం

రైతులను మోసం చేయడం విజయం

ఏడాది అరాచక పాలనే కాంగ్రెస్ విజయమా..?

'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

2



## డైవర్షన్ పాలిటిక్స్ తప్ప..
# చేసిందేమి లేదు

ప్రజానావ, హైదరాబాద్:

కాంగ్రెస్ ఏడాది పాలనలో బీఆర్ఎస్ చాలా ఆటుపోట్లు ఎదుర్కొన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోవడం, కేసీఆర్ అనారోగ్య పాలవడం, కవిత జైలుకు వెళ్లడం, మా పార్టీ ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం లాంటి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అయినా మాతో పాటే ఉన్న కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అన్ని విషయాల్లో విఫలమైంది. ఈ ప్రభుత్వంలో కేవలం ఎనుముల బ్రదర్స్‌కు మాత్రమే లాభం జరిగింది. ఈ ప్రభుత్వం ఒక్కటి కూడా పాజిటివ్ పని చేయలేదు. సీఎం అనే వారు రాష్ట్ర ప్రతిష్టను పెంచాలి. కానీ, దివాళా దిశగా తీసుకెళ్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. ఇంగ్లీషు వచ్చిన కొత్త పీఆర్ఓలను పెట్టుకున్నాడు. తెలంగాణ ఫాలింగ్ జరుగుతుంటే.. రైజింగ్ అని అంటున్నాడని పేర్కొన్నారు. అప్పులు అని తన అసమర్ధతను చెప్పుకుంటున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయొద్దు. సంవత్సర కాలం ఆగండి అని మా కేసీఆర్ చెప్పారు. ఈ సంవత్సరంలో సాధించిన విజయాలు చెప్పట్లేదు. హామీలు ఎలా నెరవేరుస్తారో చెప్పకుండా.. అప్పుల గురించి మాట్లాడుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు. అయితే, రాహుల్ గాంధీని తీసుకొచ్చి ఎన్నో హామీలు ఇచ్చారు. నేను రేపో ఎల్లుండో రాహుల్ గాంధీకి లేఖ రాస్తాను.. అశోక్ నగర్ కు వచ్చి విద్యార్థులను మోసం చేసాడు రాహుల్.. తెలంగాణలో మళ్ళీ ప్రభుత్వ హత్యలు స్టార్ట్ అయ్యాయి.. ఆటో డ్రైవర్లతో పాటు ఎంతో మంది విద్యార్థులు సైసైడ్ చేసుకుంటున్నారు..అవన్నీ ప్రభుత్వ హత్యలే' అని కేటీఆర్ వెల్లడించారు.

## కేసులు కొట్టేయడం
# కుదరదు..

(మొదటి పేజీ తరువాయి)

దాడికి సంబంధించి పట్నం నరేందర్‌రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ దాడి కుట్రలో నరేందర్‌రెడ్డి హస్తం ఉందనే ఆరోపణలతో ఆయనను అరెస్ట్ చేశారు. కేబీఆర్ పార్క్ వద్ద జాగింగ్‌కు వెళ్లిన పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు బలవంతంగా తరలించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ కేసులో బెయిల్ కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, లగచర్ల దాడి ఘటనకు సంబంధించి తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఆయన మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు.. కేసు కొట్టేయలేమంటూ పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్‌ను తోసిపుచ్చింది.



## ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

ప్రజానావ, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఖరారయ్యాయి. డిసెంబర్ 9వ తేదీ నుంచి అసెంబ్లీ సెషన్స్ ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10.30 గంటలకు శాసన సభ, శాసన మండలి సమావేశాలు స్టార్ట్ కానున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా.. ఈ అసెంబ్లీ సమావేశాలు మరింత రసవత్తరంగా మారే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా ఈ సెషన్స్‌లో రేవంత్ ప్రభుత్వ ఏడాది పాలన, రైతు రుణమాఫీ, రైతు భరోసా, హైడ్రా, మూసీ ప్రక్షాళన లాంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక, తెలంగాణ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సైతం ప్లాన్ వేస్తున్నాయి. గురుకుల పాఠశాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు, వికారాబాద్ జిల్లాలో లగచర్ల ఘటన, రైతు భరోసా, ధాన్యానికి రూ. 500 బోనస్ వంటి అంశాలపై చర్చకు పట్టుపట్టే ఛాన్స్ ఉంది. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు అసెంబ్లీ సమావేశాల్లో ఒక్కసారే జరిగాయి. ఈ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఒక్క రోజు మాత్రమే సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. ఆ రోజు సెషన్స్ ముగిసిపోక ముందే వెళ్లిపోయారు. ఈ సారైనా అసెంబ్లీ సెషన్స్ కు కేసీఆర్ వస్తారా.. లేదా అనేది ఉత్కంఠ రేపుతుంది. ఒక వేళ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వస్తే.. కాంగ్రెస్ సర్కార్ రియాక్షన్ ఎలా ఉంటుందనేది మరింత ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# తెలంగాణలో భూ ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

హనుమకొండ, భూపాలపల్లితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, చర్ల, చింతకాని, నాగులవంచ, ఇల్లెందు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. ఏటూరు నాగారం మండలం శంకరాజుపల్లెలో ఓ ఇంటి గోడ కూలింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 3 సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు.



**ములుగు నుంచి 50కి.మీ దూరంలో...**

ములుగు నుంచి 50 కిలోమీటర్ల ఈశాన్యం వైపు ఏటూరు నాగారం భూకంప కేంద్రంలో రిక్టర్ స్కేల్ పై 5 తీవ్రతగా భూకంపం నమోదైందని వరంగల్ కాకతీయ వర్సిటీ జియాలజీ విభాగాధిపతి ఆర్. మల్లికార్జునరెడ్డి తెలిపారు. గతంలో 1969, 2018లో కొత్తగూడెం, భద్రాచలంలో భూ ప్రకంపనలు వచ్చాయని వెల్లడించారు. భూ కంపాలకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలు మూడో జోన్ కిందికి వస్తాయన్నారు.

**50 ఏళ్ల తర్వాత ఆ తీవ్రతతో..**

1969లో భద్రాచలం పరిసరాల్లో దాదాపు ఇదే తీవ్రతతో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. సుమారు 50 ఏళ్ల తర్వాత నేడు ఆ తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని భూగర్భ శాస్త్రవేత్తలు చెప్పారు. భూమి పగుళ్లలో ఒత్తిడితో స్థానచలనం జరిగి ప్రకంపనలు వస్తుంటాయని తెలిపారు.హైదరాబాద్, భద్రాచలం, ఏటూరు నాగారం, ములుగు తదితర ప్రాంతాలు జోన్3లో ఉన్నాయన్నారు. జోన్5లో ఉన్న ఉత్తర భారతంలోని ప్రాంతాలతో పోలిస్తే మన దగ్గర తీవ్రత తక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**ఆ ఘటనతో సంబంధముందా...?**

మేడారంలో భూకంప కేంద్రం గుర్తించిన నేపథ్యంలో ఇటీవల జరిగిన ఓ ఘటనపై స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 31న మేడారం ప్రాంతంలో భారీ వర్షంతో పాటు టోర్నడో తరహాలో బలమైన ఈదురు గాలులు వీచాయి. సుమారు 50వేల చెట్లు నేలకూలాయి. ఏటూరునాగారం నుంచి మేడారం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకు దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో ఈ నష్టం జరిగింది. ఇప్పుడు అదే ప్రాంతంలో భూకంప కేంద్రాన్ని శాస్త్రవేత్తలు గుర్తించడంతో ఆ ఘటనతో దీనికి ఏమైనా సంబంధం ఉందా?అనే కోణంలో చర్చ జరుగుతోంది. అయితే వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు, భూ ప్రకంపనలకు సంబంధం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**40 కి.మీ లోతులో భూకంప కేంద్రం..**

తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలపై తెలంగాణ విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ వివరణ ఇచ్చారు. ములుగు జిల్లా మేడారం వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు చెప్పారు. భూమికి 40 కి.మీ లోతులో ప్రకంపనలు వచ్చాయన్నారు. భూకంప కేంద్రం ఎక్కువ లోతులో ఉన్నందున ప్రకంపనల తీవ్రత తక్కువగా ఉందని చెప్పారు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని వివరించారు.



# పోలీస్‌స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డి హల్‌చల్

ప్రజానావ, హైదరాబాద్:

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హల్ చల్ చేశారు. తాను ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించాలంటూ ఒత్తిడి చేశారు. అర్జెంట్ పని ఉండడంతో తిరిగి వచ్చి తీసుకుంటానని బయటకు వెళ్లేందుకు సీఐ యత్నించడంతో ఆయన కారును బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. వెనక్కి వచ్చి ఫిర్యాదు తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ కండువా కప్పుకుని డ్యూటీ చేయ్యండంటూ సీఐని కౌశిక్ రెడ్డి బెదిరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నీ సంగతి చెబుతామంటూ సీఐపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాకు సెల్యూట్ నువ్వే కొడుతావు.. మమ్మల్ని చూసి కూడా కంప్లైంట్ తీసుకోకుండా పారిపోతున్నారంటూ కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వార్డు మెంబర్ గా కూడా గెలవని సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముళ్లకు సెల్యూట్ కొడుతారంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలకు ఎలాంటి ప్రోటోకాల్ ఇవ్వాలో మీకు తెలియాలి.. తెలియకపోతే అసెంబ్లీ రూల్ బుక్ చదువుకో.. తనకి సీఎం బందోబస్తు ఉందంటున్నా వినకుండా సీఐపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విరుచుకుపడ్డారు. 10 ఏళ్లు మా కింద పనిచేశారు.. మళ్ళీ మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సంగతి చెబుతామని పోలీసులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు దమ్ముంటే కాంగ్రెస్ కండువా కప్పుకో.. నాతో పాటు పోటీ చెయ్యి అంటూ సీఐపై విరుచుకుపడ్డారు. ఓ ఎస్ఐకి కంప్లైంట్ ఇవ్వమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల పట్ల ఎలా వ్యవహరించాలో సీఐకి నేర్పించి వెళ్తామన్నారు. 4 ఏళ్ల తర్వాత మీ సంగతి చెబుతామంటూ సీఐతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాగ్వాదానికి దిగాడు.

# ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రజానావ, పెద్దపల్లి బ్యూరో:

పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనను పోల్చి చూడాలని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాపాలనపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సభలో సీఎం ప్రసంగించారు. ప్రజల ఆశీస్సులతోనే సామాన్యుడు సీఎం అయ్యాడని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమేనని తెలిపారు. 'ఉద్యోగాల కోసమే ఖమ్మం జిల్లా పాల్వంచలో మొదట తెలంగాణ ఉద్యమం మొదలైంది. ఏడాదిలో 55వేల ఉద్యోగాలు ఇచ్చాం. మోదీ సీఎం, పీఎంగా ఉంటూ గుజరాత్‌లో ఏడాదిలో 55వేల ఉద్యోగాలు ఇచ్చారా? ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నియామక పత్రాలు ఇచ్చాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం. కోటి మంది ఆడబిడ్డలు ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా వడ్లు పండిస్తున్న జిల్లా .. పెద్దపల్లి జిల్లా. గతంలో బీఆర్ఎస్ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర రాలేదు. గజ్వేల్‌లోని తన పొలంలో ఎకరాకు రూ.కోటి సంపాదిస్తున్నానని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారు. పదేళ్లు పాలించిన ఆయన.. ఎకరాకు రూ.కోటి ఎలా సంపాదించాలో మాత్రం రాష్ట్రంలోని అన్నదాతలకు చెప్పలేదు. ఆయన




విద్య ఏందో.. ఆ రహస్యం ఏంటో ఈరోజుకూ అంతు చిక్కడం లేదు. కేసీఆర్ శాసనసభకు రావాలి.. తన మేధావితనాన్ని ప్రజలకు పంచాలి. ఎకరంలో రూ.కోటి పంట ఎలా పండించారో రైతులకు చెప్పాలి. బీసీ కులగణనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు పాల్గొనడంలేదు. ఈ ముగ్గురూ బీసీ వ్యతిరేకులా? బీసీల ఓట్లు వేయించుకోలేదా? ఒక మంచి పని కోసం ప్రభుత్వాలు ముందుకొచ్చినప్పుడు సహకరించాలి. బీసీ కులగణనలో పాల్గొనని వారిని ఈ సమాజం బహిష్కరించాలని కోరుతున్నా' అని సీఎం అన్నారు.

**ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాల ప్రదానం..**

గ్రూప్4, సింగరేణి ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలను సీఎం అందజేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను, సీఎం కప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లు



ప్రజానావ, హైదరాబాద్:

హైదరాబాద్ లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో ట్రాఫిక్ పోలీస్ డిపార్ట్ మెంట్లో ట్రాన్స్ జెండర్ల నియామకాలు కొనసాగుతున్నాయి. తొలిసారిగా సిటీ కమిషనరేట్ పరిధిలో సెలెక్షన్స్ జరిగాయి. గోశామహల్ స్టేడియంలో ట్రాన్స్ జెండర్స్ కి ఈవెంట్స్ నిర్వహించిన అధికారులు.. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరిశీలించారు. రన్నింగ్, హై జంప్, లాంగ్ జంప్ లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. సెలెక్ట్ అయిన వారికి ట్రైనింగ్ ఇచ్చి ట్రాఫిక్ లో అధికారులు నియమించనున్నారు. బుధవారం ఈవెంట్స్‌లో పాల్గొన్న 58 మంది ట్రాన్స్ జెండర్స్ ఉండగా.. 29 మంది ఉమెన్స్, 15 మంది మెన్ ట్రాన్స్ జెండర్ అభ్యర్థుల ఎంపిక అయ్యారు. కాగా, మొత్తం 44 మందిని ఈవెంట్స్ తర్వాత అధికారులు సెలెక్ట్ చేశారు. 800 మిటర్స్ రన్నింగ్, 100 మిటర్స్ రన్నింగ్, షార్ట్ పుట్, లాంగ్ జంప్ ఈవెంట్స్ నిర్వహించారు. 18 ఏళ్లు పూర్తైన వారు.. 10వ తరగతి సర్టిఫికెట్స్, ట్రాన్స్ జెండర్ సర్టిఫికెట్ ఆధారంగా అభ్యర్థులకు అధికారులు ఈవెంట్స్ నిర్వహించారు. ఇక, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.. సిటీలో 85 లక్షల వాహనాలు ఉన్నాయి.. రోజుకు 1500 వాహనాలు కొత్తగా వస్తున్నాయి.. ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. మలక్ పేట్ నుంచి గోల్కొండ వరకు నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై చర్చించామని సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

## విజయోత్సవాలు కాదు..
# వికృత ఉత్సవాలు

ప్రజానావ, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ఏడాది పాలపై ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్ సంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో పిల్లలకు పురుగులన్నం పెట్టడం విజయమని కీలక వ్యాఖ్యలు చేశారు. వారి చావులు కాంగ్రెస్ కి ఉత్సవమా అని ప్రశ్నించారు.యువతకు ఉద్యోగాలివ్వకపోవడం విజయం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి సంకెళ్లేయడం ఉత్సవం అని మండిపడ్డారు. రైతులను మోసం చేయడం విజయం.. వారికి ఉరితాళ్లేయడం ఉత్సవం అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆడబిడ్డలకు ఆగం చేయడం విజయం.. వారి కన్నీళ్లు ఉత్సవం అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండ్లు ఇస్తమని మోసం చేయడం విజయమా అని ప్రశ్నించారు. ఉన్న ఇండ్లు కూల్చడం ఉత్సవం అని బండి సంజయ్ ట్వీట్ చేశారు. రుణమాఫీ చేస్తమని మాట తప్పడం విజయం అన్నారు. అప్పులకు నోటీసులివ్వడం ఉత్సవం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది అరాచక పాలనే కాంగ్రెస్ విజయమా? అన్నారు. ప్రజల చావులు, గోసలే ఉత్సవమా? అని ప్రశ్నించారు. ఇవి విజయోత్సవాలు కాదు.. వికృత ఉత్సవాలు అని బండి సంజయ్ తన ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్ ఏడాది పాలనపై మండిపడ్డారు.

# నాపై కేసును క్వాష్ చేయండి

ప్రజానావ, హైదరాబాద్:

హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిద్ధిపేట జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని అందులో పేర్కొన్నారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో హరీశ్ రావుతో పాటు రిటైర్డ్ పోలీస్ అధికారి రాధాకిషన్ రావుపై పంజాగుట్ట పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసును నమోదు చేశారు. హరీశ్ రావుపై చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యులకు చెందిన ఇరవై ఫోన్లను ప్రణీత్ రావు సాయంతో ట్యాప్ చేశారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. ఈ క్రమంలో పంజాగుట్టలో ఎఫ్ఐఆర్ నమోదైంది.



# సాహెల్ పోలీస్ విచారణకు రావాల్సిందే

ప్రజానావ, హైదరాబాద్:

బోధన్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు సాహెల్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురు అయింది. ఈ నెల 16వ తేదీన పంజాగుట్ట పోలీసుల ముందు సాహెల్ హాజరు కావాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రజా భవన్ గేట్స్ ను రాష్ డ్రైవింగ్ తో షకీల్ కొడుకు సాహెల్ ఢీ కొట్టాడని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. కేసు ఫైల్ అయినా తర్వాత సాహెల్ దుబాయ్ పారిపోయాడు. ప్రస్తుతం దుబాయ్ లో ఉన్న సాహెల్ హైదరాబాద్ రావాల్సిందేనని.. పోలీసుల విచారణకు హాజరుకావాల్సిందేనని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ప్రజా భవన్ గేట్లను ఢీకొన్న కారు కేసులో సాహెల్ ను తప్పించి డ్రైవర్ అసిఫ్ ను నిందితుడిగా చేర్చేందుకు పంజాగుట్ట సీఐ దుర్గారావు చేసిన ప్రయత్నం బయటకు రావడంతో.. ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేశారు. ఇందులో బోధన్ ఇన్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్, అబ్ధులా వాహేద్ ను కూడా నిందితులుగా చేర్చడంతో.. మొత్తం ఈ కేసులో నిందితుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సాహెల్ దుబాయ్ పారిపోయేందుకు డ్రైవర్ అసిఫ్ సహకరించగా.. అర్షద్, సోహెల్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. మాజీ ఎమ్మెల్యే షకీల్, సాహెల్ కోసం పోలీసులు ఇప్పటికే లుక్ అవుట్ నోటీసులు ఇచ్చారు.



## రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా
# మార్చిన ఘనత కేసీఆర్‌ది

### మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజానావ, అమనగల్లు :

తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌ది అని ఆరోపించారు. కేసీఆర్ 8 లక్షల కోట్లు అప్పు చేశారని పేర్కొన్నారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 67 వేల కోట్ల రూపాయలకు అప్పులు కట్టిందని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో కేసీఆర్ 3 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారు.. రైతులకు రైతు భరోసా ఎకరానికి 10 వేల రూపాయలను త్వరలో ఇస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఇక, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తాం.. ప్రజలు ప్రతి పక్షాల మాటలు నమ్మొద్దు అని కోరారు. కల్వకుర్తి అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని మంత్రి చెప్పుకొచ్చారు. అయితే, ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా



యాట గీత నరసింహ ముదిరాజ్, వైస్ చైర్మన్ గా గూడూరు భాస్కర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డిలు పాల్గొన్నారు.



## రాజన్న హుండీ ఆదాయం రూ.1.34కోట్లు

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. గత ఆరు రోజుల వ్యవధిలో భక్తులు స్వామివారి హుండీల్లో సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.1,34,45,031 నగదు, 173 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి సమకూరినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపులో కార్యనిర్వహణాధికారి వినోద్ రెడ్డి, ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈఓలు, పర్యవేక్షకులున్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు




**ప్రజానావ, సిరిసిల్ల:**

భూమి పట్టా చేపిస్తానని చెప్పి పలుమార్లు డబ్బులు వసూలు చేసిన రుద్రంగి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల తిరుపతి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి ఇన్‌స్పెక్టర్ జీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తిరుపతి గతంలోనూ శీలం పద్మ, శీలం హనుమక్క మధ్య వారసత్వంగా వచ్చిన భూమి వివాదంలో ఉండగా మధ్యవర్తిగా ఉన్నాడు. ఈ క్రమంలో శీలం పద్మ వద్ద రూ.లక్ష ఇస్తేనే నీ పేరుపై భూమి రిజిస్ట్రేషన్ చేపిస్తానని, లేదంటే భూమి నీకు రాకుండా చేస్తానని బెదిరించాడు. ఈ విషయమై కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు. ఎవరైనా మధ్యవర్తిత్యం లేదా పెద్దమనిషి గా వ్యవహరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. గుగ్గిళ్ల తిరుపతి బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా సర్కిల్ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు.



ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు రాష్ట్ర శ్రేయస్సును ఆకాంక్షిస్తూ, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సంకల్పిస్తూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం మహా రుద్ర యాగం, చండీ హోమం, కోడె పూజ, రుద్రాభిషేకం నిర్వహించారు.

- ప్రజానావ, వేములవాడ

# ఏటీసీతో ఉపాధి అవకాశాలు మెరుగు

**ప్రజానావ, రుద్రంగి:**

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల రుద్రంగి మండల కేంద్రానికి మంజూరి అయిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కోసం బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం స్థానిక అయ్యప్ప స్వామి వారి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలోని కేజీబీవీని వారిద్దరు కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్లేగ్రౌండ్ సరిగా లేదని వారు చెప్పగా, ఆటస్థలం చదును చేయాలని ఆటలకు కావలసిన సామాగ్రిని అందించాలని ఎంపీడీవోకు కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత తవ్వాలని పేర్కొన్నారు. త్వరలోనే విద్యార్థులకు సోలార్ హీటర్ వస్తుందని తెలిపారు. అనంతరం క్లాస్ రూమ్లను పరిశీలించి స్మార్ట్ క్లాసులో పనితీరును పరిశీలించారు. పాఠశాలలో హిందీ



టీచర్ లేరని తెలుసుకొని వెంటనే భర్తీ చేయాలని డీఈ వోను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులతో పలు పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం వంటశాలలో బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ పరిశీలించి దానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం సిరిసిల్ల జిల్లా కార్యదర్శి ముషం రమేశ్

**ప్రజానావ, సిరిసిల్ల :**

జిల్లా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేశ్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా సమస్యలు పరిష్కరిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఆశావర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. లేదంటే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని, అవసరమైతే సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా హెచ్చరించారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలలని కోరారు.



అలాగే కరోనా రిస్క్ అలవెన్స్ , పీఆర్సీ, లెప్రసీ , పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీలు, ఇతర సర్వేల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాధవేణి మంజుల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి , మహిళా సంఘా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్ దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీధర్‌తో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రులు, టీచర్స్ ఓటరు తుది జాబితా

# ఈ నెల 30 న విడుదల

**ప్రజానావ, వేములవాడ:**

ఎమ్మెల్సీ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు వేములవాడ ఆర్డీవో ఎస్.రాజేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం వేములవాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో వేములవాడ నియోజకవర్గం అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల, టీచర్స్ ఓటరు నమోదు గడువు ఈ నెల 9న ముగిస్తుందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదైన వారి తుది జాబితా ఈనెల 30న ప్రకటిస్తామని చెప్పారు.

అర్హులైన పట్టభద్రులు, టీచర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ డిసెంబర్ 26 వరకు ఓటరు నమోదు కార్యక్రమం యథావిధిగా జరుగుతుందన్నారు. ఫామ్ 6,7,8, ల ద్వారా ఓటరుగా నమోదు,



చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటరు తుది జాబితాను జనవరి 6న ప్రకటించడం జరుతుందని ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత అన్నారపు శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత పోలాస నరేందర్, బీజేపీ నేత పిన్నింటి హన్మాండ్లు, టీడీపీ నేత సీహెచ్.రామస్వామి గౌడ్‌తో పాటు ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి 6 అబద్ధాలు.. 66 మోసాలు

- మేనిఫెస్టోలో చెప్పిన ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదు
- ప్రజా పాలన విజయోత్సవాలు కాదు.. నయవంచన వారోత్సవాలు జరపాలి
- అహంకార వైఖరితోనే బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు
- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి

**ప్రజానావ, ఖైరతాబాద్:**



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాలు కాదు.. నయవంచన వారోత్సవాలు జరపాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలేమో కానీ.. కాంగ్రెస్ 6 అబద్ధాలు.. 66 మోసాలతో పాలన చేస్తుందని విమర్శించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని సాగర్ సొసైటీ క్యాంపు కార్యాలయంలో ఆయన ఖైరతాబాద్ అసెంబ్లీ బీజేపీ ముఖ్య నాయకులతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. మహిళలకు మహాలక్ష్మి పేరుతో రూ.2,500, గ్యాస్ సిలిండర్ రూ.500, గృహజ్యోతి పేరుతో 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు అని మాయమాటలు చెప్పారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం పేరుతో విద్యార్థులకు స్కూటీలు, స్కాలర్షిప్ ఇస్తానని చెప్పి మాట తప్పారన్నారు. చేయూత పేరుతో వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ. 6వేల పింఛన్ హామీ నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ఇక రైతులకు పెట్టుబడి సాయం పెంచుతామని ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. 11ఏళ్ల నుంచి రాష్ట్రంలో రేషన్‌కార్డులు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం దానిపై ఎలాంటి ప్రకటన చేయడం లేదన్నారు. నూతనంగా వివాహం చేసుకునే వధూవరులకు కళ్యాణ లక్ష్మి తోపాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పెళ్లి చేసుకున్న ప్రతి జంటకు పెళ్లికానుక పేరుతో తులం బంగారం ఇచ్చానని గుర్తుచేశారు. రైతుబంధు సహాయం రూ.10వేల రూ. 15వేల వరకు, కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తానని చెప్పిన రేవంత్ ప్రభుత్వం మాటలకే పరిమితమైందన్నారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే

బీఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ప్రజలు తప్పు చేసి మమ్మల్ని ఓడగొట్టారు. ఇప్పుడు చింతిస్తున్నారని అదే అహంకారం మాట్లాడుతున్నారని, ఇలా మాట్లాడడంతోనే ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసి, ప్రజలకు దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని, అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి విధానమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేస్తూ చైతన్యపరుస్తున్నామని, ఇందులో భాగంగా మీడియా ద్వారా ప్రజా ఉద్యమాలు చేస్తున్నట్లు రామచంద్రా రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గతంలో 58 ఏళ్లు దేశాన్ని పాలించి దేశ సంపద కొల్లగొట్టి వారి ఆస్తులను పెంచుకుంటూ కుటుంబ పాలన చేసిందని విమర్శించారు. ఈ క్రమంలోనే తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో కుటుంబ పాలనను ప్రోత్సహించిందన్నారు. బీజేపీ మాత్రం గెలిచినా.. ఓడినా సేవాభావంతో మాత్రమే పని చేస్తుందని, సేవ చేసిన వాళ్లను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు.

ప్రధాని మోడీ పాలనను ప్రపంచ దేశాలు ప్రశంసిస్తున్నాయని పేర్కొన్నారు. ఉచిత రేషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల గ్యాస్ కలెక్షన్, ఆయుష్మాన్ భారత్ కింద రూ.5లక్షల వరకు కార్పొరేట్ వైద్యం చేయించుకునే అవకాశం కల్పించారన్నారు. అలాగే ఏడాదికి రూ.6వేల రైతు సాయం ఇస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను నెరవేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



ప్రజపాలన విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా 4వ రోజు యువవికాసం సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయ ఆవరణ నుంచి పెద్దపల్లిలో జరిగే జిల్లా సభా ప్రాంగణానికి బయలుదేరుతున్న గ్రూప్-4 అభ్యర్థులు. ఈ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

- ప్రజానావ, వేములవాడ



## ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకే

# సీఎం కప్ పోటీలు

**ప్రజానావ, సిరిసిల్ల,:**

క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకే సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా జిల్లాలో సీఎం కప్ పోటీల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లలో CM's Cup 2024 క్రీడోత్సవాలు ఈ నెల 7 నుండి జనవరి 2 వరకు 36 ఈవెంట్స్ లో పోటీలు నిర్వహిస్తున్న సందర్భములో జిల్లా కమిటీ సభ్యులతో సమావేశామును ఏర్పాటు చేశారు. ఇందులో సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సీఎం కప్పును ఆయ గ్రామాలకు, మండలాలకు కేటాయించిన ఆటలను ఆయా క్రీడా ప్రాంగణాలలో విజయవంతముగా నిర్వహించాలని తెలియ చేసారు. జిల్లాలో ఉన్నటువంటి క్రీడ మైదానాలను ఉపయోగించుకొని జిల్లాకు కేటాయించిన వివిధ ఆటలను అడిపిస్తూ , అధనముగా టేబుల్ టెన్నిస్, క్యారం బోర్డ్, టైక్వాండో, కరాటే, పవర్ లిఫ్టింగ్, చెస్ వూషూ మొదలగు ఆటలను కూడా ఆడిపించాలని తెలియ చేసారు. ఇందులో ప్రథమ, ద్వితీయ,మరియు తృతీయ బహుమతిలను కేటాయించి గోల్డ్, సిల్వర్ మరియు బ్రాంజ్ మెడల్స్ కూడా విజేతలకు అందచేయగలరని తెలియ చేసారు.అలాగే జిల్లా విద్య శాఖదికారిని ఇందుకు అవసరమగు పీడీ మరియు పిఈటీలను ఆయ ఈవెంట్ ల వారిగా జరుగు పోటీలకు అదించగలరని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో యువజన అండ్ స్పోర్ట్స్ శాఖ అధికారి రాందాస్, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ఆటాపాట లతో ఆవిష్కరించిన కళాకారులు

**ప్రజానావ, సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికావొస్తున్న సందర్భంగా..బుధవారం, సిరిసిల్ల పట్టణంలోని సినారె హాల్లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకలను...*జయ జయహే ప్రజా పాలన*ధూం..ధాంగా నిర్వహించారు.ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను కళాకారులు చేసిన ప్రదర్శన తెలంగాణ నృత్య రూపకం, ప్రజా పాలన నాటకం, అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ జాతీయ గీతం ఆకట్టుకుంది. కళా ప్రదర్శనలు ద్వారా సామాజిక సందేశాలు ప్రజల హృదయాలకు చేరేలా చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సేకరిస్తున్న వరి ధాన్య కొనుగోలు దొడ్డు మరియు సన్నపు ధాన్యాలకు 500 బోనస్ తదితర అంశాలపై వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సంబురాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో జిల్లా కి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులూ, అలేఖ్య పుంజాల బృందం ఆటపాటలు, నాటికలతో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పాలనను ఆవిష్కృతం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువతీయువకులు, అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





## బంగ్లాదేశ్‌లో హిందువులపై అకృత్యాలు ఆపాలి



**ప్రజానావ, మెదక్:**

బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలకు నిరసన గా బుధవారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద బంగ్లాదేశ్ హిందువుల రక్షణ పై సంఘీభావ సభ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య వేదిక సభ్యులు మాట్లాడుతూ ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ ను జైలు నుండి విముక్తి చేయాలని అన్నారు. బంగ్లాదేశ్ లోని హిందువులు, ఇతర మైనార్టీలందరి పై ఇస్లామిక్ ఛాందసవాదుల మహిళలపై దాడులు, హత్యలు, దోపిడీలు, దహనాలు, అమానవీయ దౌర్జన్యాలు అత్యంత ఆందోళనకరమైనవి అన్నారు. ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇతర ఏజన్సీలు దానిని ఆపడానికి బదులుగా కేవలం మూగ ప్రేక్షకులుగా మారాయనీ అన్నారు. శాంతియుత నిరసనల్లో హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ ను బంగ్లాదేశ్ ప్రభుత్వం జైలుకు పంపడం అన్యాయం అన్నారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే ఆపి, చిన్మోయ్ కృష్ణదాస్ ను జైలు నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్లిష్ట సమయంలో భారతదేశం గ్లోబల్ కమ్యూనిటీ సంస్థలు బంగ్లాదేశ్ బాధితులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక సభ్యులు శ్రీవాండ్ల సాయిబాబా, కల్వకుంట్ల శివాలయం పంతులు శివ, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దేశాయిపేట లింగమూర్తి, శిరిగ ప్రభాకర్, గురుస్వామి రమేశ్, అయ్యప్ప మాలధారులు, పబ్బ సత్యనారాయణ, మల్లేశం, వింధ్య మహిళలు పాల్గొన్నారు.

## డబ్బులు డిమాండ్ చేసిన మహిళా హోంగార్డుకు రిమాండ్

**ప్రజానావ, వేములవాడ:**

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఓ మహిళా హోంగార్డుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ దేవస్థానంలో ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన ద్వారకా శేఖర్ వద్ద వేములవాడలో హోంగార్డుగా పనిచేస్తున్న వడ్ల అనూష తన భర్తకు ఆరోగ్యం బాగాలేదని రూ.3.50లక్షలు అప్పును అరు నెలల్లో తిరిగి ఇస్తానని చెప్పి తీసుకుంది. అనూష ఎంతకూ అప్పు తిరిగి చెల్లించకపోవడంతో శేఖర్ ఆమెను అప్పు చెల్లించాల్సిందేనని నిలదీశాడు. దీంతో శేఖర్ తనను పెళ్లి చేసుకున్నాడని తప్పుడు పెళ్లి పత్రికతో పాటు మార్ఫింగ్ చేసిన ఫొటోలతో అనూష బెదిరించింది. ఈ క్రమంలో పరువు పోతుందని భయపడిన శేఖర్‌ అనూషకు రూ.5లక్షలు ఇచ్చాడు. అయితే అనూష తిరిగి మరో రూ.2లక్షలు కావాలని బెదిరించడంతో చేసేదిలేక శేఖర్ వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని అనూషను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

# కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



**ప్రజానావ, మేడ్చల్:**

ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ. 18000/ చెల్లించాలి, ఆశాలను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్ట పరిధిలోకి తేవాలని,ఆశా వర్కర్లపై పై ప్రభుత్వ అధికారుల వేధింపులు అరికట్టాలని ఇట్టి సమస్యల పరిష్కారం కోసం బుధవారం రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కళ్యాణి మాట్లాడుతూ గత మూడు సంవత్సాలు నుండి ఆశా వర్కర్లు పనిచేసిన సర్వే డబ్బులు ఇవ్వలేదు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా కార్మికులకు 18000 /ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారానికివచ్చి సంవత్సరం గడుస్తున్న ఇప్పుడు వారికి 18000 ఫిక్స్డ్ వతనం ఆశా వర్కర్లకు ఇవ్వలేదు, వారికి ఈ ఎస్ ఐ,పి ఎఫ్ యూనిఫామ్ లు, ప్రమాద బీమా పథకం, రక్షణ, ఇవ్వడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదు కాబట్టివెంటనే తమ డిమాండ్స్ ని పరిష్కరించాలని కోరారు.ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిల్లాఅధ్యక్షుడు ఏ అశోక్ మాట్లాడుతూ అధికారులు ఆశ వర్కర్లపై చేస్తున్న బెదిరింపులు వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. పి హెచ్ సి వద్ద ధర్నా చేస్తుంటే అధికారులకు మింగుడు పడతలేదు. ఆశా వర్కర్ల సమస్య పరిష్కరిస్తే పెండింగ్ బిల్లులు ఇస్తే ఆశ వర్కర్లు ఎందుకు ధర్నా చేస్తారు అని ప్రశ్నించారు ??ఆశా వర్కర్లు బిల్లులు రాసినప్పుడు అధికారులు ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారు?? వాళ్లకు వచ్చే జీతాలు చాలడం లేదా మళ్లీ ఆశా వర్కర్ల జీతాలలో అందులో కూడా వాటా అడగడం సిగ్గు లేదా అని ప్రశ్నించారు?? ఆశ మాన్యువల్ లేని పనులు ఎందుకు పని చేపిస్తున్నారు? బాత్రూంలో నీరు పెట్టాలి, పి ఎస్ సి సబ్ సెంటర్ ఉడ్చాలి ,టాబ్లెట్ ఇవ్వాలి, ఇవన్నీ ఆశా పనులేనా?? ఆశ పనులు కాకుండా పై పై అధికారులు చేసే పనులన్నీ ఆశలతో చేపిస్తే పై అధికారులు ఎందుకు ఉన్నారు. ఉదా : ncd ఫాలో అప్స్ ఈ సంజీవని స్లైడ్స్ ఆన్ లైన్ చెయ్యించడం.ఆశాలు వాళ్ళ గ్రామంలోసర్వే చేయాలి కానీ పిఎస్సి వద్ద ఉదయం తొమ్మిది గంటలకు నాలుగు గంటల వరకు కూర్చోబెడితే సర్వేలు ఎలా చేస్తారు?? అని ప్రశ్నించారు. అనంతరం జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి లో కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరాహారదీక్ష,సమ్మకుకుడ్ వెళ్తాం అని హెచ్చరించాడు.యూనియన్ జిల్లా అధ్యక్షరాలు ఏ. హేమలత మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఐక్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు జయప్రద, రాధా, యాదమ్మ ,వాసంతి, అనిత, కోమలత, సబియ, కవిత ,శంకరమ్మ , సరిత, రాణి, రాజలక్ష్మి పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలకు హెచ్‌బీఎల్ చేయూత

**ప్రజానావ, శామీర్‌పేట్:**



సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ డిఐ అన్నారు. అలియాబాద్ గ్రామంలో సీసీ కెమెరాలు మరమ్మతులను నిమిత్తం 65 వేల రూపాయలను హెచ్ బి ఎల్ కంపెనీ యాజమాన్యం శామీర్పేట పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గంగాధర్ కు అందజేశారు. గురువారం అలియాబాద్ గ్రామంలో సీసీ కెమెరలు గత కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో అలియాబాద్ మాజీ ప్రజా ప్రతినిధులు హెచ్ బి ఎల్ కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి మరమ్మత్తుల నిమిత్తం నగదును అందజేశారు. ఈ సందర్భంగా డి ఐ గంగాధర్ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల తో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగప డతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు, దాతలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ పరుశురాం, అలియాబాద్ గ్రామం మాజీ సర్పంచ్ గుర్కు కుమార్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ గోలిపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు గాదే వెంకటేష్, మల్లేష్, గోపాల్, శ్రీకాంత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

**ప్రజానావ, చిన్న శంకరంపేట:**



క్రీడల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వార్థానికి తావివ్వకుండా సీఎం కప్ క్రీడలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి నీలిమ తెలిపారు, ఈనెల ఆరవ తేదీ నుండి పదవ తారీకు వరకు గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు నిర్వహించే సీఎం క్రీడా పోటీలను నిర్వహించేందుకు చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి నీలిమ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో క్రీడలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి తీసుకురావాలని మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు క్రీడాకారులకు ప్రశంస పత్రాలు ఇవ్వడం జరుగుతుందని ఎవరు కూడా స్వార్థం చూయించకుండా క్రీడా పోటీలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఆ తర్వాత రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, ఎస్ఐ నారాయణ గౌడ్, ఎంఈఓ పుష్ప వేణి, మండల వైద్యాధికారి సాయి సింధు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో
# విద్యార్థుల ప్రతిభ

**ప్రజానావ, శామీర్‌పేట:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ విజ్ఞాన భారతి హై స్కూల్ లోని ఇద్దరు విద్యార్థులు నవంబర్ 28 నుండి డిసెంబర్ 1 వరకు పూణేలో జరిగిన నేషనల్ లెవల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో 6వ తరగతి చదువుతున్నా టి. సంతోష్ గౌడ్ రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ సాధించగా, అదే స్కూల్ లో 4వ తరగతి చదువుతున్నా కే. దీపక్ కుమార్ ఒక సిల్వర్ మెడల్ ను సాధించాడు.బుధవారం తుంకుంటలోని శ్రీ విజ్ఞాన భారతి హై స్కూల్ లో మెడల్స్ సాధించిన విద్యార్థులకు మేమెంటో, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియు ట్రస్మా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బెంబడి జంగారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు గోనె సంగీత, పాఠశాల కరాటే మాస్టర్ సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడ్చల్ నియోజకవర్గం యూత్ ఉపాధ్యక్షుడిగా రాము

**ప్రజానావ, శామీర్‌పేట:**



ఇటీవలే యూత్ కాంగ్రెస్ పదవి కోసం జరిగిన తీవ్ర పోటీలో మేడ్చల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన తంటం రాము గెలుపొందరు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం యూత్ ఉపాధ్యక్షుడిగా నాకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదలు తెలియజేస్తున్నానని, అదే విధంగా నాపై నమ్మకం తో నాకు ఇచ్చిన ఈ పదివిని నమ్మకంతో నీవర్తిస్తానని, నియోజకవర్గంలోని యువతకు ఎటువంటి సహాయం కావాలన్నా నావంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు యువజన కాంగ్రెస్ నాయకులు, యువకులు శుభాకాంక్షలు తెలియజేసారు.

# పశు సంపద పెంచడమే మా లక్ష్యం

## పశువైద్యాధికారి డాక్టర్ నిఖిల

**ప్రజానావ, దౌల్తాబాద్:**

పశు సంపద అభివృద్ధి కోసం ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ నిఖిల అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం మహమ్మద్ షాపూర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంఘం మరియు పశుసంవర్ధక శాఖ వారు సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పశుగణాభివృద్ధి చేయడం కోసం పశువుల ఆరోగ్యంగా ఉండటం కోసం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ తమ పశువులకు ఎలాంటి జబ్బులు ఉన్న చికిత్స జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ శిబిరంలో 26 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 3 పశువులకు గర్భధారణ ఇంజక్షన్లు, 2 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు,18 పశువులకు సాధారణ చికిత్సలు, 32 దూడలకు నట్టల నివారణ మందులు అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో విఏ రాజిరెడ్డి, ఓఎస్ స్వామి, గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్ గౌడ్, గోపాలమిత్రాలు స్వామి, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.



# నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కులో ట్రెక్కింగ్

**ప్రజానావ, మెదక్ :**

మెదక్ జిల్లా నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కులో డీఎఫ్ఓ జోజీ ఆధ్వర్యంలో బుధవారం ఇంజనీరింగ్ విద్యార్థులు ట్రెక్కింగ్ నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో నాలుగో రోజులో భాగంగా బీవీఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, అక్షర పాఠశాల విద్యార్థులతో సైక్లింగ్, ట్రెక్కింగ్ నిర్వహించారు. నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్, నర్సాపూర్ రేంజ్ సిబ్బంది సమక్షంలో అటవీ ప్రాంతం, ఇతర అటవీ కార్యకలాపాలలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, మంటల నివారణ ప్రాముఖ్యత గురించి వివరించారు. పోచారం డిబిసిలో వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం 2024 సందర్భంగా మెదక్ జిల్లా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, పక్షుల పరిశీలన, వనదర్శిని, డిజిటల్ ఆవిష్కరణ ల గురించి వివరించారు. ఈ సందర్భంగా డి ఎఫ్ ఓ జోజి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో బాగంగా నేడు అటవీ శాఖ శాఖ కార్యక్రమాలు నిర్వహించాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 9వ తేదీ వరకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ మనోజ్ కుమార్, ఎఫ్ఎస్ఓ స్రవంతి, బీట్ ఆఫీసర్లు రాము, ప్రియాంక, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్యం.. సర్కార్ లక్ష్యం

## మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

**ప్రజానావ, మెదక్ :**

ప్రజా పాలన, ప్రజా విజయోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం ప్రజా విజయోత్సవ ర్యాలీ మెదక్ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి ప్రభుత్వ బాలుర కళాశాల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చంద్ర పాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరము విజయవంతముగా పూర్తి చేసుకోవడం జరుగుతుందనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కొరకు చేపట్టిన వివిధ పథకాలు, అభివృద్ధి 9 రోజులు పాటు విజయోత్సవ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ విద్యా, వైద్యం ఉచితంగా అందజేయాలనే మంచి ఆలోచన తో ఈ ప్రభుత్వం ఉన్నదని అన్నారు. ఇటీవల మెదక్ పట్టణములో మెడికల్ కళాశాల ప్రారంభించుకున్నామని, అదే విధంగా వగ్స్యువల్ పద్ధతి న నర్సింగ్ కళాశాలను కూడా ప్రారంభంచుకున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కుల, మతలకు అతీతంగా కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందించాలనే ఉద్దేశంతో గురుకులాలు ఏర్పాటు చేస్తుందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆరోగ్యశ్రీ పథకం 5 లక్షల నుండి 10 లక్షలకు వరకు పెంచినట్లు తెలిపారు.

పేద కుటుంబాలకు భారం పడకుండా వంట గ్యాస్ 500 లకు అందిస్తున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. ఈ కార్యక్రమములో కౌన్సిలర్లు లక్ష్మీ నారాయణ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు గంగాధర్, ఉమర్, మాజీ వైస్ చైర్పర్సన్ రాగి అశోక్, నాయకులు బొద్దుల కృష్ణ, మున్సిపల్ అన్ని విభాగాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# యాసంగిలో పొద్దుతిరుగుడు పంట మేలు

- తక్కువ నీటితో పంట సాగు
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

**ప్రజానావ, దౌల్తాబాద్:**

వరి కోతలు పూర్తి చేసుకొని రైతులు యాసంగి సాగుకు సంసిద్ధమవుతున్న తరుణంలో తక్కువ నీటితో ఎక్కువ లాభం పొంది పంటల పట్ల రైతులు చైతన్యం కావాలని దొమ్మాట వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ కుమార్ బుధవారం రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ నేపథ్యంలో యాసంగిలో తక్కువ నీటితో తక్కువ కాలంలో చేతి కచ్చే పొద్దుతిరుగుడు పంట సాగు రైతులకు లాభ సాటిగా ఉంటుందని, మంచి లాభాలు గడించడమే కాకుండా నీటి ఎద్దటి సమస్య లేకుండా మంచి దిగు బడులు సాధించవచ్చని పొద్దుతిరుగుడు సాగులో మెలుకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవ చ్చని తెలిపారు.

**పొద్దుతిరుగుడు విత్తులు విత్తే సమయం..**

సాధారణంగా 100 నుంచి 110 రోజుల్లో తక్కువ నీటితడులతో వంట పూర్తవుతుంది. రబీలో నవంబర్ నుంచి డిసెంబర్ నెలల్లో, వేసవిలో నీటి పారుదల క్రింద సాగు చేసుకునే వారు జనవరి మూడో వారం నుంచి ఫిబ్రవరి రెండో వారం వరకు విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 30 సెం.మీ ఎడం పాటించాలి. ఒక ఎకరానికి 2 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. వరి తరువాత ప్రొద్దు తిరుగుడు వేసుకునే పక్షంలో డిసెంబరు ఆఖరి వారం నుంచి జనవరి మొదటివారం వరకు విత్తుకోవాలి.



**ఎరువుల యాజమాన్యం...**

పొద్దుతిరుగుడు పంటలో ఎరువుల యాజమాన్యం ముఖ్య పాత్ర వహిస్తుంది మంచి దిగుబడులు సాధించ డానికి మొదటి దఫా విత్తిన తర్వాత నత్రజని 50శాతం (35 కిలోల యూరియా) తరువాత రెండో దఫాగా విత్తిన 30 రోజుల తరువాత మొగ్గ తొడిగే దశలో 25శాతం(18 కిలోల యూరియా), మూడో దఫాగా 50 రోజుల తరువాత పూవ్వు వికసించే దశలో 25 శాతం(18కిలోల యూరియా) ఒక ఎకరానికి వేసుకోవాలి. భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో 150 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. పైపాటుగా ఎరువు వేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి, గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఎకరాకు 10 కిలోల గంధకాన్ని జిప్సం రూపంలో (55 కిలోలు) ఎకరాకు వేస్తే నూనె శాతం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు. 2 గ్రా బోరాక్స్ లీటరు నీటికి చొప్పున కలిపి పైరు పూత దశలో (ఆకర్షక పత్రాలు వికసించే దశలో) ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. దీని వలన గింజలు బాగా కడుతుంది. లేదా ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 కిలోల చొప్పున బోరిక్ ఆమ్లాన్ని వేసుకోవడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చు.

**కలుపు నివారణ..**

కలుపు నివారణ కోసం విత్తిన 30 నుంచి 40 రోజుల వరకు పంటలో కలుపు లేకుండా చూసుకోవాలి. దీని వల్ల మొక్కలు మంచిగా పెరుగుతాయి. కలుపు నివారణ కోసం లీటరు నీటికి పెండిమిథాలిన్ 30శాతం ఈ.సి ద్రావణాన్ని 5 మి.లీ కలుపుకొని విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారి చేసుకోవాలి. విత్తిన 20 నుంచి 25 రోజుల తరువాత గొర్రుతో అంతరకృషి చేయాలి లేదా ఫినాక్సిప్రాప్ ఇథైల్/క్విజలోఫాప్ ఇథైల్ 1.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమం లో అన్నదాతలు పాల్గొన్నారు.



## యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పరుశురాంగౌడ్


**ప్రజానావ, మెదక్:**

మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా పరుశురాం గౌడ్ ఎన్నికయ్యారు. మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించారు. ఈ పోటీలో 8 మంది పోటీలో ఉండగా అత్యధిక ఓట్లు పరుశురాం గౌడ్ కు రావడం జరిగింది. ఈ ఓటింగ్ ప్రక్రియ అంతా కూడా ఆన్ లైన్ లో నిర్వహించారు. ఈ పోటీ లో హవేలీ ఘనపూర్ మండలం తిమ్మాయి పల్లి గ్రామానికి చెందిన పరుశురాం గౌడ్ అత్యధిక మెజార్టీ తో గెలిచినట్లు రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన పరుశురాం మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు తన కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీని జిల్లాల్లో మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, రోహిత్ రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇంచార్జి రాజీ రెడ్డి లతో పాటు గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షురాలుగా పబ్బ మాధవి అశోక్

**ప్రజానావ, దౌల్తాబాద్:**

ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలుగా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పబ్బ మాధవిని నియమించినట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు ,మాడిశెట్టి హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యత, బలోపేతం చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా నియామకానికి సహకరించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్,జిల్లా మాజీ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగ మూర్తి మహాసభ రాష్ట్ర



నాయకులు, జిల్లా నాయకులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బ అశోక్, మండల మహిళా అధ్యక్షురాలు పసుపు నూరి పద్మ, టౌన్ అధ్యక్షుడు గంప రవి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా భరత్ రామ్

**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

చిన్న శంకరంపేట మండల యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా మండలంలోని చెన్నైపల్లి గ్రామం చెందిన భరత్ రామ్ యాదవ్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చాలా సంతోషంగా ఉండాలని మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని, పార్టీ ఏ పిలుపునిచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తానని అన్నారు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

### బీజేపీ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి

**ప్రజానావ, దౌల్తాబాద్:**

పేద ప్రజలు అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాలంటే ఎంతో కష్టతరమవుతుందని సీఎం సహాయనిధి పథకం ద్వారా లబ్ధిపొందుతూ మెరుగైన వైద్యం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని బిజెపి దౌల్తాబాద్ మండల అధ్యక్షులు సర్వుగారి భూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్, కోనాపూర్ గ్రామాలలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు సభ్యుడు (ఎంపీ) మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు ఇందుప్రియాల్ గ్రామంలో హనుమండ్లకాడి కాశి రూ. 22,500, కోనాపూర్ తిప్పగౌని మహేశ్వరి రూ.11,500 వేల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. నిరుపేద కుటుంబాల ప్రజలు అనారోగ్యానికి గురైతే వైద్యం చేయించుకోవాలనుకుంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అలాంటిది సీఎం సహాయ నిధి ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా చికిత్స తీసుకోవచ్చన్నారు. పేదల పక్షాన పోరాడే ప్రజా నాయకులు ఎంపీ రఘునందన్ రావు, ఆయన సహకారంతోనే సీఎం సహాయం నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరు అనారోగ్యానికి గురైన సీఎం సహాయంనిధి పథకం ద్వారా లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు గడ్డమీ స్వామి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తిప్పగౌని సత్యనారాయణ గౌడ్,బూత్ అధ్యక్షులు రమేష్, కరుణాకర్, అనిల్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజానావ, దౌల్తాబాద్:**

ప్రాథమిక పాఠశాల లింగాయపల్లి తాండ పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అయిత చంద్రశేఖర్ ,సుధాకర్ రెడ్డి లకు బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘన సన్మానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాస్, ఉపాధ్యాయులు కుమారస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ప్రజానావ, తూప్రాన్:**

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని యాంటీ నార్కోటీక్స్ బ్యూరో డిఎస్పి పుష్పన్ కుమార్ అన్నారు. ఆయన బుధవారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని గీతా జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత పలు కారణాలవల్ల చదువును మధ్యలోనే వదిలేసి చెడు అలవాట్లకు అలవాటు పడి బానిసలుగా మారి చెడు దారిన పడుతున్నారన్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత ఎక్కువగా చెడు అలవాట్ల కు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోవద్దు అన్నారు. చిన్నతనం నుంచి చదువుతోపాటు మంచి అలవాట్లు నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం, యాంటీ నార్కోటెక్స్ ఎస్సై రాము, కాలేజీ లెక్చలర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**ప్రజానావ, దౌల్తాబాద్:**

ప్రభుత్వ హాస్టల్, పాఠశాలలలో మధ్యాహ్న భోజనం ఆహారం సౌకర్యాలు విద్య కచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని దౌల్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం లింగరాజు పల్లి మహాత్మ జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ వెనుకబడిన గురుకుల పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ మొత్తం కలియ తిరిగి విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించడం జరిగిందన్నారు. స్వయంగా విద్యార్థులతో మాట్లాడి వసతులను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

భోజనశాలను సందర్శించి వంట కార్మికులకు తగు సూచనలు చేయడం జరిగింది.ఖచ్చితంగా వంటగదిలో పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని, వంటకు తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని సూచించడం జరిగిందన్నారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. హాస్టల్ పాఠశాలను ఎలాంటి అసౌకర్యాలు ఉన్న పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

చిన్న శంకరంపేట మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేశారు కమిటీ చైర్మన్గా కళాశాల ప్రిన్సిపల్ శశిధర్, కోఆర్డినేటర్ గా రసాయన శాస్త్ర అధ్యాపకులు అనిల్ కుమార్, విద్యార్థి సభ్యులుగా బాలికల నుండి పల్లవి, మధుమిత, బాలురనుండి భానుతేజ, మహేందర్, ను నియమించినట్లు ప్రిన్సిపల్ శశిధర్ తెలిపారు, నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బందితో అనుసంధానం చెందుతూ సమాజంలో డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తారని డ్రగ్స్ రహిత నిర్మాణం




కోసం కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజానావ, తూప్రాన్:**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి హాస్పిటల్ లో చికిత్స పొందుతు బుధవారం మృతి చెందిన సంఘటన తూప్రాన్ లో చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ కు చెందిన మార్యాల దశరథ (50) ఆదివారం తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద వెనుక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బైక్ పై వెళ్తున్న దశరథ ను బలంగా ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో దశరథ తీవ్రంగా గాయపడ్డ దశరథ ను అంబులెన్స్ లో తూప్రాన్ లోని గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించారు. అక్కడి నుండి మెరుగైన ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్ తరలించగా రెండు రోజులుగా అక్కడ ట్రీట్మెంట్ పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.



## అప్పుడనుకుంటే.. ఇప్పుడు కుదిరింది

**హైదరాబాద్:** పారిస్ ఒలింపిక్స్ ముగియగానే పెళ్లి చేసుకుందామని భావించినట్లు భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు తెలిపింది. వరుస టోర్నీలతో తీరిక లేకుండా ఉండటం వల్ల వివాహం ఆలస్యమైందని చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్త సాయిను వివాహమాడనున్న సింధు.. పెళ్లి, కెరీర్ గురించి 'ఈనాడు'తో ముచ్చటించింది. వివరాలు ఆమె మాటల్లోనే..

**అమ్మ, నాన్న ఆశీస్సులతో..**

జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నందుకు సంతోషంగా ఉంది. అమ్మ, నాన్న కష్టంతో బ్యాడ్మింటన్‌లో ఈ స్థాయికి చేరుకున్నా. వాళ్లిద్దరి ఆశీస్సులతో వివాహం చేసుకోబోతున్నా. నా జీవితంలో ఎంతో అపురూపమైన సందర్భమిది. మా రెండు కుటుంబాల మధ్య ఎప్పట్నుంచో పరిచయం ఉంది. ఒలింపిక్స్ ముగియగానే పెళ్లి చేసుకోవాలని భావించాం. కానీ తీరిక లేని షెడ్యూల్ కారణంగా కుదరలేదు. జనవరి నుంచి మళ్లీ టోర్నీలు ఉన్నాయి. దీంతో వివాహానికి డిసెంబరు 22ను సరైన రోజుగా భావించాం. నెల రోజుల ముందే పెళ్లి నిశ్చయమైంది. ఇరువైపుల నుంచి కొద్దిమంది కుటుంబ సభ్యుల సమక్షంలో ఉదయ్‌పూర్‌లో పెళ్లి వేడుకలు జరుగుతాయి. అక్కడైతే కాస్త గోప్యత ఉంటుంది. 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుంది. ఆ రోజు అందరినీ ఆహ్వానించాలని నిర్ణయించాం.

**నా మ్యాచ్‌లు చూస్తారు..**

వెంకట్ నాకు కుటుంబ స్నేహితుడు. ఆయనకు కంపెనీ ఉంది. దాని నిర్వహణలో బిజీగా ఉంటారు. నా షెడ్యూల్ తీరిక లేకుండా ఉంటుంది. చాలా తక్కువ సందర్భాల్లో కలిశాం. వెంకట్ బ్యాడ్మింటన్ ఆడరు. కానీ నా మ్యాచ్‌లు చూస్తారు. బ్యాడ్మింటన్‌ను అనుసరిస్తారు. క్రీడలంటే ఇష్టం. కానీ వ్యాపారం వైపు వెళ్లారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, డేటా సైన్స్‌లో ఉన్నత విద్య పూర్తిచేశారు. ప్రస్తుతం సొంత కంపెనీ పోసిడెక్స్ టెక్నాలజీస్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

**ఫిట్‌గా ఉండటం లక్ష్యం**

వివాహం తర్వాత కూడా బ్యాడ్మింటన్ కొనసాగిస్తా. గాయాలకు దూరంగా ఉంటూ ఫిట్‌నెస్ కాపాడుకోవడమే నా లక్ష్యం. పెళ్లి కుదిరిన తర్వాత కూడా ప్రాక్టీస్ మానలేదు. మంగళవారం కూడా సాధన చేశా. ఉదయ్‌పూర్‌కు వెళ్లే వరకూ ప్రాక్టీస్ కొనసాగుతుంది. పెళ్లయ్యాక కొన్ని రోజులకు మళ్లీ సాధన మొదలుపెడతా. జనవరి నుంచి కొత్త సీజన్ ప్రారంభమవుతుంది. అందుకోసం సర్వసన్నద్ధంగా ఉండాలి. రానున్న సీజన్ ఎంతో కీలకం. వరుసగా టోర్నీలు ఉన్నాయి. అన్ని ప్రధాన టోర్నీల్లో బరిలో దిగాలని భావిస్తున్నా. సయ్యద్ మోదీ సూపర్ 300 టైటిల్‌తో నా ఆత్మవిశ్వాసం పెరిగింది. సరైన సమయంలో ఈ విజయం లభించిందని అనుకుంటున్నా. మళ్లీ లయను దొరకబుచ్చుకున్నా. ఫిట్‌గా ఉంటే 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లోనూ ఆడతా. గాయాలు కాకుండా మంచి ఫిట్‌నెస్‌తో ఉంటే అది కష్టమేమీ కాదు.

**ఘన వారసత్వం.. ఆటలపై ఆసక్తి**

సింధుకు కాబోయే భర్త సాయి వెంకట దత్తా బ్యాడ్మింటన్ ఆడడు కానీ.. ఆటలపై బాగానే ఆసక్తి ఉంది. మోటార్ స్పోర్ట్‌స్‌లో తనకు ప్రవేశం ఉంది. డర్ట్ బైకింగ్, మోటార్ ట్రెక్కింగ్‌లో తరచూ పాల్గొంటూ ఉంటాడు. తన దగ్గర డజను సూపర్ బైక్స్‌తో పాటు కొన్ని స్పోర్ట్స్ కార్లూ ఉన్నాయి. అతడి తండ్రి గౌరెల్లి వెంకటేశ్వరరావు ఆదాయపు పన్ను శాఖలో మాజీ అధికారి. ప్రస్తుతం సాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న ప్రోసిడెక్స్ టెక్నాలజీస్ సంస్థను ఆయనే నెలకొల్పారు. సాయి తల్లి లక్ష్మి. ఆమె తండ్రి భాస్కరరావు హైకోర్టు జడ్జిగా పదవీ విరమణ చేశారు. భాస్కరరావు అన్న ఉజ్జిని నారాయణరావు సీపీఐ పార్టీ తరఫున నల్గొండ జిల్లా మునుగోడు మాజీ ఎమ్మెల్యేగా పని చేశారు. జిందాల్ సౌత్ వెస్ట్ (జేఎస్‌డబ్ల్యూ)తో ప్రొఫెషనల్ కెరీర్‌ను ప్రారంభించిన సాయి.. జేఎస్‌డబ్ల్యూ సహ యజమానిగా ఉన్న దిల్లీ క్యాపిటల్స్ జట్టు వ్యవహారాల్ని చూసుకున్నాడు.

### పింక్ బాల్ టెస్టు అంటే కోహ్లీ చెలరేగుతాడు..

# గణాంకాలివే

**అడిలైడ్:** బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఎంతో ప్రత్యేకమైన పింక్ బాల్ టెస్టుకు టీమ్ఇండియా, ఆస్ట్రేలియా సిద్ధమవుతున్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగే ఈ డేఅండ్‌నైట్ మ్యాచ్‌లో మన ఆటగాళ్లు ఎలా రాణిస్తారన్నది కీలకం. ఇక పరుగుల వీరుడు విరాట్ కోహ్లీకి పింక్ బాల్ టెస్టుల్లో మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకూ భారత్ ఎన్ని పింక్ బాల్ టెస్టులు ఆడింది.. ఎన్ని విజయాలు నమోదు చేసింది..? విరాట్ రికార్డులపై ఓ లుక్కేస్తే..టీమ్ఇండియా ఇప్పటివరకూ నాలుగు పింక్ బాల్ టెస్టులు ఆడింది. మూడింట్లో విజయం సాధించింది.

**నవంబర్ 2019.. ప్రత్యర్థి బంగ్లాదేశ్**

టీమ్ఇండియా ఆడిన తొలి పింక్‌బాల్ టెస్టు ఇది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ శతకంతో చెలరేగాడు. 194 బంతుల్లో 136 పరుగులు సాధించాడు.

**డిసెంబర్ 2020.. ప్రత్యర్థి ఆస్ట్రేలియా**

ఆస్ట్రేలియాతో జరిగిన ఈ టెస్టు భారత్‌కు ఓ పీడకల. రెండో ఇన్నింగ్స్‌లో 36 పరుగుల అత్యల్ప స్కోరుకే కుప్పకూలింది. 8 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. కోహ్లీ తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 4 రన్స్ చేశాడు.

**ఫిబ్రవరి 2021.. ప్రత్యర్థి ఇంగ్లండ్**

అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ పింక్ బాల్ టెస్టు రెండు రోజుల్లోనే ముగిసింది. ఇంగ్లండ్‌ను 10 వికెట్ల తేడాతో భారత్ మట్టికరిపించింది. కోహ్లీకి ఒక్కసారే బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. 27 పరుగులు చేశాడు.

**మార్చి 2022.. ప్రత్యర్థి శ్రీలంక**

భారత్ చివరిసారిగా ఆడిన పింక్ బాల్ టెస్టు ఇదే.



బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 238 పరుగుల తేడాతో శ్రీలంకపై విజయం నమోదు చేసింది.

**కోహ్లీ గణాంకాలివే..**

నాలుగు పింక్ బాల్ టెస్టులూ కోహ్లీ ఆడాడు. మొత్తం 277 పరుగులు చేశాడు. పింక్ బాల్ టెస్టుల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసింది కోహ్లీనే. అతడి సరాసరి 46.17ఒక శతకం నమోదు చేశాడు. బంగ్లాదేశ్‌పై అతడు నమోదు చేసిన 136 పరుగులు అత్యుత్తమం.కెప్టెన్‌గా రెండు విజయాలు అందుకున్నాడు.పింక్ బాల్ టెస్టుల్లో మొత్తం 33 ఫోర్లు బాదాడు.బంగ్లాపై రహానెతో కలిసి 4వ వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఇక ఆస్ట్రేలియాతో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో తన ఫామ్‌ను అందుకున్న కోహ్లీ.. మరోసారి పింక్ బాల్ టెస్టులో చెలరేగి ఆడాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు. పెర్త్ టెస్టు విజయంతో ఇప్పటికే భారత్ ఈ సిరీస్‌లో 10 ఆధిక్యంలో ఉంది.



### భారత ఆటగాళ్ల ప్రాక్టీస్ సెషన్స్..

## అభిమానులపై నిషేధం!

**అడిలైడ్:** బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ ిరీస్‌లో ఇకపై టీమ్ఇండియా ఆటగాళ్ల ప్రాక్టీస్ సెషన్స్ సమయంలో అభిమానులను అనుమతించరు. అడిలైడ్‌లో ఆసీస్‌తో రెండో టెస్టు కోసం భారత టెస్టు ప్రాక్టీస్ చేస్తోంది. అయితే, మంగళవారం భారత ఆటగాళ్లు సాధన చేస్తుండగా వందలాది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో టీమ్ఇండియా ప్లేయర్లను చాలా దగ్గరి నుంచి చూశారు. ఈ క్రమంలో కొంతమంది ఆసీస్ అభిమానులు భారత ఆటగాళ్లను ఎగతాళి చేస్తూ మాట్లాడారు. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న టీమ్‌మేనేజ్‌మెంట్ ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఇకపై, ఈ టూర్‌లో భారత జట్టు ఓపెన్ ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొనదని తేల్చిచెప్పింది. 'ఇది పూర్తిగా గందరగోళంగా ఉంది. ఆస్ట్రేలియా ఆటగాళ్ల ప్రాక్టీస్ సెషన్స్‌కు 70 మంది ప్రేక్షకులు కూడా హాజరు కాలేదు. కానీ, టీమ్ఇండియా ప్లేయర్స్ సాధన చేస్తున్నప్పుడు 3000 మంది వచ్చారు. ఇంత మంది అభిమానులు వస్తారని ఎవరూ ఊహించలేదు'' అని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నాడు. భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ అడిలైడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్ నెట్ సెషన్స్ వల్ల ఇబ్బంది పడినట్లు తెలిపాడు. డిసెంబరు 6న అడిలైడ్ వేదికగా రెండో టెస్టు (పింక్ బాల్) టెస్టు ప్రారంభం కానుంది.

## అడిలైడ్ టెస్టు.. పిచ్‌పై 6 మిల్లీమీటర్ల గడ్డి

**హెడ్ క్యూరేటర్ డామియన్ హగ్**

**అడిలైడ్:** బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా ఆసీస్, భారత్ల మధ్య పింక్ బాల్ టెస్టు జరగనుంది. ఈ మ్యాచ్ డిసెంబరు 6న ప్రారంభం కానుంది. పెర్త్‌లో తొలి టెస్టులో 295 పరుగుల తేడాతో విజయం, ఆపై గులాబీ బంతితో ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గెలుపొంది భారత్ జోరు మీదుంది. అడిలైడ్‌లో భారత్‌ను కట్టడి చేసి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని కంగారులు ప్రణాళికలు రచిస్తున్నారు. 2020లో ఇదే మైదానంలో ఆసీస్‌తో జరిగిన పింక్ బాల్ టెస్టులో భారత్ 36 పరుగులకే ఆలౌటైంది. ఇప్పుడు కూడా టీమ్ఇండియా జోరుకు బ్రేక్‌లు వేసేందుకు పచ్చికతో కూడిన పిచ్‌ను రూపొందిస్తోంది. పిచ్‌పై ఆరు మిల్లీమీటర్ల గడ్డిని ఉపయోగిస్తామని హెడ్ క్యూరేటర్ డామియన్ హగ్ తెలిపాడు. కొత్త బంతితో ఫ్లడ్ లైట్ల కింద బ్యాటింగ్ చేయడం బ్యాటర్లకు కష్టంగా మారుతుందని డామియన్ హగ్ పేర్కొన్నాడు. 'పరిస్థితులు ఇంతకుముందు లానే ఉంటాయి. పిచ్‌పై పచ్చిక ఎక్కువగా ఉండి తేమశాతం అధికంగా ఉంటుంది. పిచ్ పొడిగా,



కఠినంగా ఉంటుంది. రోజులు గడుస్తున్నకొద్దీ స్పిన్నర్లు కూడా కొంత ప్రభావం చూపిస్తారు, బౌన్స్ కూడా లభిస్తుంది. ప్రస్తుతం పిచ్‌పై ఏడు మిల్లీమీటర్ల గడ్డి ఉంది. దాన్ని ఆరు మిల్లీమీటర్లకు తగ్గిస్తాం. బ్యాట్‌కు, బంతికి మధ్య పోటీని అందించే పిచ్‌ను రూపొందించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ.. కొత్త బంతితో లైట్ల కింద బ్యాటింగ్ చేయడం కష్టంగా ఉంటుంది. రెండు జట్లకు నాణ్యమైన బౌలింగ్ దళం ఉంది. బంతి పాతబడిన కొద్దీ బ్యాటర్లు మంచి స్కోర్లు సాధిస్తారని ఆశిస్తున్నా' అని అడిలైడ్ హెడ్ క్యూరేటర్ వివరించాడు.



### అండర్19 ఆసియా కప్..

## దంచికొట్టిన వైభవ్ సూర్యవంశీ.. సెమీస్‌కు భారత్

**షార్జా:** అండర్19 ఆసియా కప్‌లో యువ భారత్ సెమీస్‌కు చేరింది. బుధవారం యూఏఈతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమ్ఇండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈని 44 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. గత రెండు మ్యాచ్‌ల్లో నిరాశపర్చిన 13 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ (76*; 46 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఈ సారి మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. మరో ఓపెనర్ ఆయుష్ మాత్రే (67*; 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకం బాదాడు. దీంతో 138 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 16.1 ఓవర్లలోనే ఛేదించింది. శుక్రవారం (డిసెంబరు 6) జరిగే సెమీస్‌లో భారత్‌తో శ్రీలంక తలపడనుంది. ఫైనల్ డిసెంబరు 10న దుబాయ్ వేదికగా జరగనుంది.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టులో ఒక్కరూ కూడా అర్ధ శతకం చేయలేకపోయారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ రాయన్ ఖాన్ (35; 48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. అక్షత్ రాయ్ (26), ఏతాన్ డిసౌజా (17), ఉద్దీష్ (16) పరుగులు చేశారు. టీమ్ఇండియా బౌలర్లలో యుధజిత్ 3, చేతన్ శర్మ 2, హర్దిక్ రాజ్ 2, కార్తికేయ, ఆయుష్ మాత్రే ఒక్కో వికెట్ పడగొట్టారు.

## ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్.. రెండు స్థానాలు కోల్పోయిన జైస్వాల్

**దుబాయ్:** ఐసీసీ తాజాగా టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనతో బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో అత్యుత్తమమైన రెండో స్థానానికి చేరిన టీమ్ఇండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ తాజాగా రెండు స్థానాలను కోల్పోయాడు. నాలుగో స్థానానికి చేరాడు. దీనికి కారణం ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ ప్రదర్శన. న్యూజిలాండ్‌పై 171 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన బ్రూక్ రెండో స్థానానికి ఎగబాకాడు. తొలి స్థానంలో కొనసాగుతున్న జో రూట్‌కు చేరువగా వచ్చాడు. ఇక ఈ విభాగంలో రిషభ్ పంత్ ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు.బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమ్ఇండియా స్టార్ పేసర్ బుమ్రా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. అశ్విన్ నాలుగో స్థానంలో ఉండగా.. రవీంద్ర జడేజా ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని ఆరో ప్లేస్‌కు చేరుకున్నాడు. జట్ల పరంగా టీమ్ఇండియా రెండో ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. ఆస్ట్రేలియా తొలిస్థానంలో ఉంది.ఇక ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమ్ఇండియా పెర్త్ టెస్టులో ఘన విజయం సాధించి ఈ సిరీస్‌లో 10 ఆధిక్యంలో కొనసాగుతోంది.





### ఐసీసీ ఛైర్మన్‌గా జై షా..

## బీసీసీఐ కార్యదర్శి రేసులో ఉన్నది వీరే!

**ముంబై:** మొన్నటివరకు బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న జై షా ఇటీవల ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో అతడి స్థానంలో బీసీసీఐ కార్యదర్శిగా ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తిరేపుతోంది. గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్, ప్రస్తుతం బీసీసీఐ జాయింట్ సెక్రెటరీగా ఉన్న దేవ్‌జిత్ సైకియా రేసులో ఉన్నట్లు సమాచారం. దిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ కూడా బీసీసీఐ కార్యదర్శిపై ఆసక్తితో ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అవన్నీ తప్పుడు కథనాలని ఆయన కొట్టిపారేశారు.'ఏం జరుగుతుందో మాకు తెలియదు. అందరూ (బీసీసీఐ అధికారులు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు) ఈ విషయంపై మౌనంగా ఉన్నారు. ప్రస్తుతానికి జాయింట్ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా తాత్కాలిక కార్యదర్శిగా ఉంటారు. రోజువారీ ప్రాతిపదికన పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. కార్యదర్శిగా ఎన్నికయ్యే వారికి బీసీసీఐ ఎలా నడుస్తుందనే దానిపై కొంచెం అవగాహన ఉండాలి' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ఆఫీస్ బేరర్ రాజీనామా చేసినట్లయితే 45 రోజుల్లోపు బోర్డు ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించి అతని స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎన్నికలు నిర్వహించడం కోసం కనీసం నాలుగు వారాల ముందు ఎన్నికల అధికారిని కూడా నియమించాల్సి ఉంటుంది.

## బ్యాటింగ్ ఆర్డర్.. ఆ విషయం మీతో చెప్పకూడదన్నారు..!

**అడిలైడ్:** బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా టీమ్ఇండియా రెండో టెస్టుకు సిద్ధమైంది. డేఅండ్‌నైట్ మ్యాచ్‌గా జరిగే ఈ పింక్ బాల్ టెస్టులో భారత జట్టు కూర్పు ఆసక్తికరంగా మారింది. సారథి రోహిత్‌శర్మ అందుబాటులో లేని తొలి టెస్టులో కేఎల్ రాహుల్.. జైస్వాల్‌తో కలిసి ఓపెనింగ్ చేశాడు. జట్టు విజయంలో కీలక పరుగులు సాధించాడు. మరి ఇప్పుడు రెండో టెస్టు రోహిత్ ఆడనున్న నేపథ్యంలో.. బ్యాటింగ్ ఆర్డర్ చర్చనీయాంశంగా మారింది. రోహిత్ ఏ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలి.. రాహుల్‌ను ఎక్కడ ఆడించాలనే దానిపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై కేఎల్ స్పందించాడు.మీరు ఏ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలో చెప్పారా..? అని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌కు ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు తనదైనశైలిలో సమాధానమిచ్చాడు. ''అవును నాకు చెప్పారు. అయితే.. దాన్ని మీతో పంచుకోవద్దని కూడా చెప్పారు'' అనడంతో అక్కడ నవ్వులు



విరిశాయి. ఇక ఏ ప్లేస్‌లోనైనా ఆడేందుకు తాను సిద్ధమని కేఎల్ స్పష్టంచేశాడు. ఓపెనింగ్, మిడిల్ ఆర్డర్‌లో ఎక్కడైనా ఆడతానని పేర్కొన్నాడు. ''నేను ప్లేయింగ్ XIలో ఉండాలనుకుంటున్నాను. అంటే ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయాలి. జట్టు కోసం ఆడాలి'' అని వివరించాడు.''నేను చాలా స్థానాల్లో బ్యాటింగ్ చేశాను. అయితే.. తొలి 2025 బంతులను ఎలా ఎదుర్కోవాలో సాంకేతికంగా కాకుండా, మానసికంగా సవాలుగా ఉండేది. నేను ఎంత తొందరగా అటాక్ చేయాలి.. ఎంత జాగ్రత్తగా ఉండాలి.. ఇలాంటి విషయాలన్నీ ఆరంభంలో నా మదిలోకి వచ్చేవి. వీటన్నింటిని నేను అధిగమించాను. ఇప్పుడు నేను టెస్టులు, వన్డేల్లో అన్ని స్థానాల్లో ఆడుతున్నాను. దీంతో నా ఇన్నింగ్స్‌ను ఎలా మేనేజ్ చేసుకోవాలో నాకు తెలుసు'' అని తెలిపాడు.''టాప్ ఆర్డర్ లేదా మిడిల్ ఆర్డర్.. ఎక్కడ బ్యాటింగ్ చేసినా.. తొలి 30 బంతులను సమర్థంగా ఎదుర్కొంటే.. ఆ తర్వాత బ్యాటింగ్ సులువవుతుంది. దీనిపైనే నేను దృష్టిపెడతాను'' అంటూ వివరించాడు రాహుల్.ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో రాహుల్ మొదటి ఇన్నింగ్స్‌లో 26 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 77 పరుగులతో రాణించాడు. దీంతో అతడిని ఓపెనింగ్ బ్యాటర్‌గానే కొనసాగించాలని.. రోహిత్‌ను 5 లేదా 6వ స్థానంలో ఆడించాలని పలువురు సూచిస్తున్నారు.

# చలికాలంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటే మంచిది



**చలికాలంలో అనేక సీజనల్ వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, ఫ్లూ.. అనేక ఇతర సీజనల్ వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. ఆహారం పట్ల శ్రద్ధ వహించాలి. కాలానుగుణ వ్యాధులను నివారించడానికి.. బలమైన రోగనిరోధక శక్తిని కలిగి ఉండటం చాలా ముఖ్యం. ఇది మన శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.**

చలికాలంలో వ్యాధులు రాకుండా ఉండాలంటే.. సీజనల్ పండ్లు, కూరగాయలు తినడం చాలా ముఖ్యమైనది. అంతేకాకుండా.. కొన్ని పప్పులు, గింజలను తినడం వల్ల సీజనల్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చలికాలంలో మన రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతాయి.

గుమ్మడికాయ గింజలలో ఆరోగ్యకరమైన ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తి ని పెంచుతాయి.

బాదంపప్పు తింటే ఆరోగ్యానికి ఎల్లప్పుడూ మేలు చేస్తుంది. ఇందులో జింక్ ఉంటుంది. ఇది శరీర కణజాలాలను సరిచేయడంలో, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. బాదంలో విటమిన్ 'ఇ' కూడా ఉంటుంది. ఇది వాపును తగ్గిస్తుంది.

– చలికాలంలో వేరుశెనగలను ఎక్కువగా తింటారు. వేరుశనగలు రోగనిరోధక శక్తిని, కణాల పునరుత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. శీతాకాలంలో వేరుశెనగను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల నుండి మనల్ని రక్షించడంలో మేలు జరుగుతుంది.

– చలికాలంలో వ్యాధులు రాకుండా ఉండేందుకు అవిసె గింజలను తినడం మంచిది. అవిసె గింజల్లో కూడా ఒమేగా3, కొవ్వు ఆమ్లాలు, అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి మన రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.





# కంటి చూపు మెరుగుపడాలంటే ఇలా చేయాలి

కంటి చూపు విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే కంటికి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఎక్కువ సేపు స్క్రీన్ టైమ్, డైట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కళ్లకు తీవ్రంగా హాని కలుగుతుంది.

ముఖ్యంగా ఈ రోజుల్లో పిల్లలు చిన్న వయస్సు లోనే కళ్లజోడు వాడాల్సిన పరిస్థితులకు సరైన పోషకాహారం లేకపోవడంతోపాటు ఎక్కువసేపు స్క్రీన్ పై గడపడమే ప్రధాన కారణాలని డాక్టర్లు చెబుతున్నారు.


రోజంతా స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ స్క్రీన్‌లను చూడటం వల్ల కళ్లపై తీవ్రంగా ఒత్తిడి పడుతుంది. దీని కారణంగా, కంటి చూపు కోల్పోయే ప్రమాదం మరింతగా పెరుగుతుంది. ఈ సమస్య పెద్దలు లేదా వృద్ధులలో మాత్రమే కాకుండా, పిల్లలలో కూడా ఎక్కువగా కనిపిస్తుంది. దీనివల్ల సరిగ్గా చూడాలంటే అద్దాలను ఆశ్రయించాల్సివస్తోంది.

బలహీనమైన కంటి చూపు వెనుక అనేక ఇతర కారణాలు ఉన్నాయి. అటువంటివాటిలో ఆహారం కూడా ఒకటి. ఆహారంలో అవసరమైన పోషకాలను చేర్చకపోతే కంటి చూపు క్రమంగా బలహీనంగా మారుతుంది.

కళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవాలి. మనం తీసుకునే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం, తద్వారా కళ్ళు అవసరమైన పోషకాలను పొందుతాయి.

కళ్లను ఆరోగ్యంగా ఉంచే ఆహార పదార్థాలను తెలుసుకుందాం.

మెరుగైన కంటి ఆరోగ్యం కోసం, విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా క్యారెట్లు, ఆకుకూరలు తీసుకోవడం చాలా మంచిది.





# కారం ఎగ్ దోస టెస్ట్ చూద్దామా

బ్రేక్ ఫాస్ట్ లో ఎక్కువ మంది ప్రిపేర్ చేసేది దోశ. కానీ దోశల్లో కొన్ని వందల రకాలుంటాయి. ప్రస్తుతం ఎగ్ దోశ అంటే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఒక్కసారి ఎగ్ దోశ తిన్నారంటే ఫిదా అయిపోతారు. అంతలా రుచికరంగా ఉంటుంది. మరి ఇంకెందుకు ఆలస్యం. ఈ రెసీపీని ఎలా తయారు చేసుకుంటారో చూద్దాం

ఇలా తయారు చేసుకోవాలి.

మినపపప్పు, బియ్యం, అటుకులు, మెంతులు కడిగి, 4 గంటలపాటు నానబెట్టుకోవాలి.

నీళ్లు యాడ్ చేసుకుంటూ మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. కనీసం 12 గంటలపాటు పులియబెట్టుకోవాలి.

ఉప్పు వేసి బాగా మిక్స్ చేసుకొని పక్కన ఉంచుకోవాలి.

ఎండుకారాన్ని ప్రిపేర్ చేసుకోవాలి. ఇందుకోసం మిక్సీ జార్ తీసుకొని అందులో ఎండుమిర్చి, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, ఉప్పుతో పాటు కాసిన్ని వాటర్ పోసుకొని మిరపగింజలూ మెదిగేలా మెత్తని పేస్ట్‌లాగా మిక్సీ పట్టుకోవాలి.

ఆవాలు, కరివేపాకు వేసుకొని స్టవ్ పై కాసేపు వేయించుకోవాలి. ఆపై మిక్సీ పట్టుకున్న ఎండుమిర్చి పేస్ట్ ని అందులో వేసి మీడియం ఫ్లేమ్ మీద కలుపుతూ నూనె పైకి తేలేంత వరకు వేయించుకోవాలి.

ఇప్పుడు ఎగ్ దోశ కోసం.. స్టౌపై దోశ పెనం పెట్టుకొని వేడి చేసుకోవాలి. పెనం బాగా వేడెక్కిన తర్వాత మంటను తగ్గించి పెద్ద గరిటెడు పిండిని తీసుకొని దోశ మాదిరిగా వేసుకోవాలి.ఆపై అట్టు అంచుల వెంబడి కొద్దిగా ఆయిల్ వేసుకొని కాల్చుకోవాలి. దోశపైన పిండి మగ్గి అట్టు మధ్యన ఎర్రగా మారిన టైమ్‌లో.. మధ్యలో మీరు ప్రిపేర్ చేసుకున్న ఎండుకారాన్ని ఒక టేబుల్‌స్పూన్ వేసుకొని దాని మీద ఒక గుడ్డుని బ్రేక్ చేసి నెమ్మదిగా దోశ మొత్తం స్ప్రెడ్ చేసుకోవాలి.అయితే, దోశ మీద ఎగ్ స్ప్రెడ్ చేస్తున్న టైమ్‌లో మంట మీడియం ఫ్లేమ్‌లోనే ఉండాలి. లేదంటే అడుగున



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## మొఘల్ సామ్రాజ్యాన్ని సవాలు చేసిన యోధుడు

'కాంతార' చిత్రంతో జాతీయ ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని సొంతం చేసుకున్న కథానాయకుడు రిషబ్ శెట్టి. ఆయన ప్రధాన పాత్రలో నటించనున్న చిత్రం 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్'. హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో సందీప్ సింగ్ తెరకెక్కించనున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. "ఇది కేవలం సినిమా మాత్రమే కాదు. అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, మొఘల్ సామ్రాజ్యాన్ని సవాలు చేసిన ఓ యోధుడి కథ" అనే వ్యాఖ్యను జోడించింది. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2027 జనవరి 21న ప్రేక్షకుల ముందుకు రానుంది.


### 'అమరన్' ఓటీటీ రిలీజ్ నిలిపివేయండి..

## కోర్టులో విద్యార్థి దావా

'అమరన్' సినిమాలో తన ఫోన్ నంబరు వినియోగించడం వల్ల చాలా ఇబ్బంది కలిగిందని పేర్కొంటూ చెన్నైకు చెందిన విఘ్నేశన్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి చిత్ర బృందానికి లీగల్ నోటీసులు పంపించిన విషయం తెలిసిందే. తాజాగా అతడు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ సినిమా ఓటీటీ విడుదలపై బ్యాన్ విధించాలని కోరుతూ దావా వేశాడు. చిత్ర బృందం నుంచి తనకు ఇంకా నష్టపరిహారం అందలేదని పేర్కొన్నాడు. అంతేకాకుండా గతంలో తాను లీగల్ నోటీసులు పంపించినప్పటికీ సినిమా నుంచి తన ఫోన్ నంబర్ ఉన్న సన్నివేశాలు తొలగించలేదని పేర్కొన్నాడు. దానివల్ల తనకు ఫోన్ కాల్స్ నుంచి ఇబ్బంది తొలగలేదని అన్నాడు. 'అమరన్'లోని ఒక సన్నివేశంలో హీరోయిన్.. హీరోకు తన ఫోన్ నంబర్ ఇస్తుంది. దీని కోసం చిత్ర బృందం ఒక నంబర్ ఉపయోగించింది. సినిమా విడుదలయ్యాక.. సాయి పల్లవి ఫోన్ నంబర్ అదేనని భావించిన పలువురు అభిమానులు కాల్స్ చేయడం మొదలుపెట్టారు. సినిమాలో చూపించిన నంబర్ తనదేనని.. వరుస ఫోన్ కాల్స్, సందేశాల వల్ల తనకు వ్యక్తిగత ప్రశాంతత లేకుండా పోయిందని విఘ్నేశన్ పేర్కొన్నాడు. దీనివల్ల తాను కుటుంబసభ్యులతో సరిగా సమయాన్ని గడపలేకపోతున్నానని చెప్పాడు. తన ఫోన్ నంబర్ ఉపయోగించినందుకు చిత్ర బృందం వెంటనే రూ.1.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇటీవల టీమ్‌కు లీగల్ నోటీసులు పంపించాడు.



## అలాంటి అబ్బాయిలు నిజంగానే ఉన్నారు: షాహిద్ కపూర్



సందీప్ వంగా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటించిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. రొమాంటిక్ డ్రామాగా 2017లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం సంచలనం సృష్టించింది. దీన్ని బాలీవుడ్‌లో షాహిద్ కపూర్ 'కబీర్ సింగ్' పేరుతో రీమేక్ చేశారు. అక్కడ ఈ చిత్రం విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ చిత్రంపై ఆయన ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆ సినిమాలో చూపించిన అర్జున్ లాంటి అబ్బాయిలు నిజజీవితంలోనూ ఉన్నారన్నారు. "ఆ సినిమాలో చేసిన కొన్ని సన్నివేశాలు వ్యక్తిగతంగా నాకు నచ్చకపోయినప్పటికీ అలాంటి అబ్బాయిలు సమాజంలో ఉన్నారు. మనం ఎలా ఉండాలనేది పూర్తిగా మన నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. నిజ జీవితంలోని సంఘటనలు లేకుండా సినిమాను తీయలేరు. 'కబీర్ సింగ్' సినిమాలో చాలా విషయాలు ఆమోదయోగ్యం కాదు. ఈ కథ విన్నప్పుడు అలాంటి అబ్బాయిలు ఉంటారా? అలాంటి వాళ్లతో అమ్మాయిలు ప్రేమలో పడతారా? అని అనుకున్నాను. అలాంటి వారుంటారని అమ్మాయిలు వారిని ప్రేమిస్తారని ఆ తర్వాత తెలిసింది. అందుకే దీనిపై సినిమా ఎందుకు తీయకూడదనిపించింది. అలాంటి సినిమాలను ఆదరించాలా, లేదా అనేది పూర్తిగా ప్రేక్షకుడి నిర్ణయం" అని చెప్పారు. 'కబీర్ సింగ్' సినిమా 2019లో బాలీవుడ్‌లో విడుదలైంది. రూ.60 కోట్లతో రూపొందించగా.. రూ.379 కోట్లు వసూలు చేసింది. ఇందులో షాహిద్ కపూర్ సరసన కియారా అడ్వాణి నటించారు. దీనికి కూడా సందీప్ రెడ్డి వంగానే దర్శకత్వం వహించారు. సినిమా భారీ వసూళ్లు సొంతం చేసుకున్నప్పటికీ విమర్శలను కూడా ఎదుర్కొంది.

## అప్పుడు హీరోయిన్..
## ఇప్పుడు ఐటెమ్ సాంగ్?



నార్నె నితిన్ , సంగీత్ శోభన్, రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్' . చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ సక్సెస్ అందుకున్న 'మ్యాడ్' కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కల్యాన్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. 'మ్యాడ్' సూపర్ హిట్ కావడంతో.. ఇప్పుడు వస్తున్న సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీలోకి మరో యంగ్ బ్యూటీ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుసామజవరగమన' చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ రెబా మోనికా జాన్. మొదటి చిత్రంతోనే తన అందం, నటనతో ప్రేక్షకులను కట్టిపడేసింది. తర్వాత మరో మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వని ఈ బ్యూటీ.. ప్రజెంట్ మ్యాడ్ స్క్వేర్‌లో స్పెషల్ సాంగ్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. అయితే.. దీనిపై ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు కానీ ప్రజెంట్ రెబా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది.స్తోంది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657